

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : గురువారం సా : 6.35 గం.
సహర్ : శుక్రవారం ఉ : 4.45 గం.

బీభత్సం.. భయానకం

రియాకర్ట్ పేలుడుతో భారీ శబ్ధం చెలరేగిన మంటలు..ఆవరించిన పొగ



పేలుడు తీవ్రతకు ధ్వంసమైన ఎస్‌బీ ఆర్గానిక్ పరిశ్రమ

- చెల్లాచెదురైన మృతదేహాలు.. ఎగిరిపడ్డ క్షతగాత్రులు
- ఎటు చూసినా హాహాకారాలు
- ఉలిక్కిపడిన చుట్టుపక్కల గ్రామాలు



క్షతగాత్రులకు సాయం చేస్తున్న స్థానికులు

హత్నూర, ఏప్రిల్ 3: సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చందాపూర్ శివారులోని ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో బుధవారం రియాక్టర్లు పేలి ఐదుగురు మృత్యువాత పడటం, 20 మందికి పైగా గాయపడటంతో ఆ ప్రాంతంలో భయానక వాతావరణం నెలకొంది. ఈ ప్రమాదంలో ఐదుగురి మృతదేహాలు చెల్లాచెదురుగా.. రక్తం మడుగుల్లో పడి ఉండగా.. సుమారు 20 మంది వరకు గాయపడినట్లు చెబుతున్నారు. పలువురు గల్లంతవడంతో పరిశ్రమ శకలాలను పూర్తిగా పరిశీలిస్తే మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. అలాగే, తీవ్రంగా గాయపడినవారు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండడంతో ఎప్పుడు ఎవరికేం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రమాదంలో పొట్ట చేతపట్టుకుని పనుల కోసం వచ్చిన కార్మికులతో పాటు ఏకంగా పరిశ్రమ డైరెక్టర్ కూడా అక్కడికక్కడే మృతి చెందడంతో పారిశ్రామిక ప్రాంతంలో కలకలం సృష్టించింది.

సాయంత్రం వేళ రియాక్టర్ వద్ద కార్మికులు పని చేస్తున్న సమయంలో అవి పేలినట్లు ప్రాథమికంగా తెలిసింది. కార్మికులు తెలిపిన కథనం ప్రకారం రియాక్టర్లు లీకవుతుండడంతో అక్కడ పనిచేసే సిబ్బంది తమ పై అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో డైరెక్టర్, ప్రొడక్షన్ ఇన్‌చార్జి వచ్చి పరిశీలించారు. లీకేజీ అధికం కావడంతో కరెంటు నిలిపివేసి, బాయిలర్లను ఆఫ్ చేశారు. ఒత్తిడి పెరగడంతో బాయిలర్లు, రియాక్టర్లు ఒక్కసారిగా పేలిపోయి, మంటలు ఎగిసిపడ్డాయి. క్షణాల వ్యవధిలోనే దట్టమైన పొగ పరిశ్రమను కమ్మేసింది. పేలుడు తీవ్రతకు పరిశ్రమలో చాలాభాగం నేలమట్టమయింది. అందులో పనిచేస్తున్నవారు ఎగిరి దిక్కుకొకరు పడ్డారు. ప్రాణాలతో మిగిలినవారు పరుగులు తీశారు.

తమవారేమయ్యారో తెలియక..

పేలుడు శబ్దం రావడం, మంటలు ఎగిసిపడడంతో ప్రమాదం జరిగినట్టు తెలుసుకుని కార్మికుల కుటుంబాలు, చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పరుగున చేరుకున్నారు. వెంటనే సహాయ చర్యలు ప్రారంభించినా శకలాల మధ్య బూడిదలో కూరుకుపోయిన మృతదేహాలు, క్షతగాత్రులను గుర్తించడం కష్టంగా మారింది. చెల్లాచెదురుగా పడిన మృతదేహాలు, రక్తమోడుతున్న గాయాలతో క్షతగాత్రుల రోదనలతో ఘటనాస్థలాన్ని చూసి భీతిల్లారు. కార్మికుల కుటుంబ సభ్యులు తమ వారేమయ్యారో తెలియక రోదిస్తూ శకలాల మధ్య వెతుకులాడడం కనిపించింది. తమవారి జాడ తెలియకపోవడంతో వివరాలు తెలపాలని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ప్రమాదం జరిగిన రెండు గంటల అనంతరం ఐదుగురు మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. మృతుల్లో తమవారు లేకపోవడంతో కుటుంబ సభ్యులు క్షతగాత్రులు చికిత్స పొందుతున్న ఆసుపత్రులకు పరుగులు తీశారు.

కాలం చెల్లిన రియాక్టర్లు కావడం వల్లే..

ఎస్‌బీ ఆర్గానిక్స్ యూనిట్-1 పరిశ్రమలో కాలం చెల్లిన రియాక్టర్లను ఉపయోగించడంతోనే ప్రమాదం సంభవించినట్లు అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు తెలిసింది. అంతేకాకుండా దశాబ్దాల క్రితం నిర్మించిన భవనంతోపాటు బాయిలర్ కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరినట్లు సమాచారం. ఇటీవల బాయిలర్ వద్ద నామమాత్రపు మరమ్మతులు చేపట్టి కొనసాగిస్తున్నట్లు తెలిసింది. సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడమే ప్రమాదానికి ప్రధాన కారణమని స్థానికులు, కార్మికుల కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి : ఎమ్మెల్యే

ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. ప్రమాద విషయం తెలియగానే ఆమె సంఘటనా స్థలానికి వచ్చారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

పర్యవేక్షణ లోపం వల్లే : రఘునందన్‌రావు

పరిశ్రమలపై అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. ప్రమాద స్థలాన్ని సందర్శించిన ఆయన మృతుల కుటుంబాలకు కోటి రూపాయల ఆర్థిక సహాంతో పాటు, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం : కలెక్టర్

పరిశ్రమలో పేలుడు సంభవించి ప్రాణాప్రాయ స్థితిలో కొట్టుమిట్టాడుతూ ఎమ్మెన్నార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులకు అందుతున్న వైద్య సేవలను కలెక్టర్ వల్లూరు క్రాంతి పర్యవేక్షించారు. గాయపడిన వారిలో ఏడుగురిని హైదరాబాద్‌లోని వివిధ ఆస్పత్రులకు తరలించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పీ రూపేష్, సంగారెడ్డి ఆర్డీవో వసంత కుమారి, తహసీల్దార్ ఫర్హీన్‌షేక్‌లు పరిశ్రమ వద్ద సహాయక చర్యలు చేపట్టారు.





ఆస్పత్రి వద్ద వివరాలు తెలుసుకుంటున్న మంత్రులు దామోదర్, కొండా సురేఖ

నీటి ఎద్దడి నివారణకు కంట్రోల్‌రూం నంబర్ 9391942254

మెదక్ అర్బన్, ఏప్రిల్ 3: మెదక్ జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలవారీగా యాక్షన్‌ప్లాన్ అమలు చేస్తున్నట్టు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఆయన అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. నీటిఎద్దడి నివారణ, ఉపాధిహామీ పనులు, మన ఊరు-మన బడి, ఎండల తీవ్రతపై చర్చించారు. జిల్లాలో నీటి సమస్యలపై ఫిర్యాదు చేయడం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం నంబర్ 9391942254 ఏర్పాటు చేశామని తెలిపారు. దీంతో పాటు తాగునీటి సమస్యలపై ఫిర్యాదు చేయడం కోసం ఉదయం 6 నుంచి 2 గంటల వరకు పంచాయతీలకు సంబంధించి 950040589 నంబర్‌కు, మున్సిపాలిటీలకు సంబంధించి 7396907444 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 వరకు పంచాయతీలకు 7702824957, మున్సిపాలిటీలకు 9381369485 నంబర్లకు సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. మన ఊరు-మన బడి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఉపాధిహామీ కూలీలు, పంచాయతీ కార్మికులు ఉదయం 11 గంటల లోపు పని పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ విధుల్లో పాల్గొనే పీవో, ఏపీవో, సిబ్బందికి ఈ నెల 4, 6 తేదీల్లో మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నర్సాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు.

ధరణిలో దందాలు..!

- బదిలీ అయిన ఉన్నతాధికారి నిర్వాకం
- ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి కలెక్టరేట్ ఫైళ్లు
- కలెక్టరేట్‌లో సెక్షన్ క్లర్క్ సస్పెన్షన్
- ఉద్యోగుల్లో కలకలం



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఏప్రిల్ 4: భూముల రక్షణ కోసం ఏర్పాటు చేసినట్టు చెప్పుకున్న ధరణి పోర్టల్ మాటున జరిగిన అక్రమాలకు సజీవ సాక్ష్యంగా కలెక్టరేట్ సెక్షన్ క్లర్క్ సస్పెన్షన్ వ్యవహారం నిలుస్తున్నది. ధరణి వల్ల పెద్దలే లబ్ధి పొందారనడానికి ఈ ఘటన బలం చేకూరుస్తున్నది. సంగారెడ్డి కలెక్టరేట్‌లో చోటు చేసుకున్న ఈ సంఘటన జిల్లాలోని రెవెన్యూ ఉద్యోగుల్లో కలకలం రేపుతున్నది.

ఇప్పటికే కంప్యూటర్ ఆపరేటర్

పట్టా భూమిని కానీ, వివాదాస్పదంగా ఉన్న భూమిని కానీ గతంలో రెవెన్యూ అధికారులు తొలుత నిషేధిత జాబితాలో చేర్చారు. పదెకరాలున్న ఒక సర్వే నంబర్‌లో రెండెకరాలు వివాదాస్పదంగా ఉన్నా.. మొత్తం భూమిని నిషేధిత జాబితాలో చేర్చడం రెవెన్యూ అధికారులకు పరిపాటైంది. ఇటువంటి భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలంటే తహసీల్దార్ నుంచి జిల్లా స్థాయి రెవెన్యూ ఉన్నతాధికారి వరకు సంబంధిత వ్యక్తి కలిసి విన్నవించుకోవాలి. ఇందుకు లక్షలాది రూపాయలు చేతులు మారితేనే నిషేధిత జాబితా నుంచి భూమిని తొలగిస్తారని ఆరోపణలున్నాయి. ఇటువంటి ఆరోపణలతో ఇదివరకు కలెక్టరేట్‌లో కాంట్రాక్టు పద్ధతిపై పనిచేసిన కంప్యూటర్ ఆపరేటర్‌ను తొలగించిన విషయం తెలిసిందే.

కలెక్టరేట్ ఫైళ్లు ప్రైవేట్ వ్యక్తులకు

ఇటీవలే బదిలీ అయిన రెవెన్యూ ఉన్నతాధికారులు ధరణికి సంబంధించిన ఫైళ్లను కలెక్టరేట్ నుంచి ప్రైవేట్ వ్యక్తులతో తెప్పించుకొనే వారని తెలిసింది. ధరణిలో వివాదాస్పదంగా ఉన్న భూముల పరిష్కారం కోసం ఆయా అధికారులు తమ క్యాంపు ఆఫీసుకు తెప్పించుకొని, బాధితుడితో చర్చించే వారని తెలిసింది. ఈ సందర్భంగా లక్షల రూపాయలు చేతులు మారితేనే సదరు ఫైళ్లకు పరిష్కారం కుదిరేదని తెలిసింది. ఇందుకు కలెక్టరేట్‌లో తాజాగా వెలుగు చూసిన వ్యవహారం, కలెక్టర్ వల్లూరి క్రాంతిని ఆశ్చర్యానికి గురిచేసింది. ఫలితం కలెక్టరేట్‌లో సెక్షన్ క్లర్కు సస్పెన్షన్‌కు దారి తీసింది.

పిటిషన్‌దారుడి చేతిలో కలెక్టరేట్ ఫైలు


కలెక్టరేట్ ధరణి విభాగంలో ఉండాల్సిన ఫైలును పిటిషన్ దారుడు తీసుకుని రావడం కలెక్టర్ వల్లూరి క్రాంతిని విస్తుపోయేలా చేసింది. నిజానికి ఈ ఫైలు ఇదివరకు పనిచేసిన ఉన్నతాధికారి తన వద్దకు తీసుకురావాలని పిటిషన్‌దారుడికి సూచించారు. తండ్రి పేరిట ఉన్న భూమిని తన పేరిట మార్చుకొనేందుకు సదరు పిటిషన్‌దారుడు కొన్నాళ్ల కిందట ఆ ఉన్నతాధికారి ఆదేశాలతో కలెక్టరేట్ నుంచి ఫైలు తీసుకున్నారు. ఈలోపు సదరు ఉన్నతాధికారి బదిలీ కావడంతో పిటిషన్‌దారుడు ఫైలును నూతన కలెక్టర్ వల్లూరి క్రాంతి వద్దకు తీసుకొని వచ్చారు. ఫైలును చూసిన ఆమె ఈ ఫైలు నీ దగ్గరకు ఎలా వచ్చిందని ప్రశ్నించారు. సెక్షన్‌లో ఉండాల్సిన ఫైలును పిటిషన్‌దారుడికి ఇవ్వడంపై సెక్షన్ క్లర్క్‌ను కలెక్టర్ క్రాంతి సస్పెండ్ చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై ఆమె విచారణ చేయిస్తున్నారు.

చిరుద్యోగిపై చర్యలా?

సెక్షన్ క్లర్క్ సస్పెన్షన్ వ్యవహారం రెవెన్యూ ఉద్యోగుల్లో కలకలం రేపింది. ఉన్నతాధికారి ఆదేశాలతోనే సెక్షన్ క్లర్క్ ఫైలు ఇచ్చారని ఉద్యోగులు అంటున్నారు. అంతేగాక కలెక్టరేట్‌లోని ఫైలు సూపరింటెండెంట్, ఏవో, డీఆర్వో అనుమతి లేకుండా పిటిషన్‌దారుడి చేతికి వెళుతుందా? అని వారు ప్రశ్నిస్తున్నారు. వీరెవరిపై చర్యలు లేకుండా చిరుద్యోగిని సస్పెన్షన్ చేయడం సమంజసం కాదని ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు. క్లర్క్‌పై సస్పెన్షన్ ఎత్తివేసి, విధుల్లో తీసుకోవాలని రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ ప్రతినిధులు త్వరలోనే కలెక్టర్‌ను కలిసి కోరనున్నారు. అయితే, కలెక్టరేట్‌లో ఉండాల్సిన ఫైళ్లు ఇలా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పడడం చర్చనీయాంశంగా మారింది.

సర్వేంతర్యామి..!

ఓటరు అంతరంగంపై అభ్యర్థుల నజర్



- అభిప్రాయ సేకరణకు సర్వే ఏజన్సీలు
- పల్లెలు, పట్టణాల్లో సరళిపై ఆరా
- సర్వే రిపోర్టుల ఆధారంగానే ప్రచారంలో మార్పులు
- ఎత్తుగడల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు నిమగ్నం
- మెదక్ పార్లమెంటు పరిధిలో ఎన్నికల హడావుడి

సిద్దిపేట నియోజకవర్గంలోని ఓ హోటల్‌కు ఒకరు వెళ్లారు. ఛాయ్ తాగుతూ ఆ హోటల్ యజమానిని ముచ్చట్లలో దింపాడు. మెదక్ ఎంపీగా ఏ పార్టీ అభ్యర్థి గెలవొచ్చని ప్రశ్నలు వేశాడు. సదరు యజమాని ఒక పార్టీ గురించి వ్యతిరేక వ్యాఖ్యలు చేశాడు. ఆ పార్టీ తప్పిదాలపై మాట్లాడాడు. తర్వాత రెండ్రోజులకు ఆ యజమానికి ఒక ఫోన్ కాల్ వచ్చింది. 'అన్న.. మనసులో ఏమీ పెట్టుకోకే. ఈసారి మా పార్టీకే నువ్వు సపోర్ట్ చెయ్యి. అట్లాగే నీ హోటల్‌కు వచ్చేవాళ్లకు కూడా మన పార్టీ గురించి మంచిగా చెప్పండి' అంటూ అవతలి వ్యక్తి అనడంతో కంగుతిన్నాడు. తన మాటలు అక్కడిదాకా ఎలా వెళ్లాయో తెలియక తల పట్టుకున్నాడు.

...ఇలాంటి అనుభవాలు మెదక్ పార్లమెంటు నియోజకవర్గంలోని చాలా మందికి ఎదురవుతున్నట్లుగా తెలుస్తున్నది. పోలింగ్‌కు ఇంకా 40 రోజులకు పైగా సమయం ఉండడంతో ఓటరు మదిలో ఏముందో తెలుసుకునేందుకు పార్టీలు ప్రయత్నిస్తున్నాయి.

– ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఏప్రిల్ 3:

మెదక్ పార్లమెంటుకు సంబంధించి ఇప్పటికే ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను ఖరారు చేశాయి. బీఆర్ఎస్ అభ్యర్థిగా వెంకట్రామారెడ్డి, బీజేపీ అభ్యర్థిగా రఘునందన్‌రావు, కాంగ్రెస్ నుంచి నీలం మధు బరిలో ఉన్నారు. ముగ్గురు అభ్యర్థులూ ప్రచారం చేసుకుంటున్నారు. అయితే, ఎవరికివారు ప్రచార పంథాను ఎప్పటికప్పుడు మార్చుకోవడం కనిపిస్తున్నది. ఈ మార్పులకు కారణం సర్వే సంస్థలు అందజేస్తున్న నివేదికలేనని తెలుస్తున్నది. సర్వే రిపోర్టుల ఆధారంగానే ప్రచార ఎత్తుగడలు మారుతున్నాయి. మే 13వ తేదీన పార్లమెంటు ఎన్నికల పోలింగ్ జరగనుంది. కేవలం 40 రోజుల సమయం మాత్రమే ఉంది. పార్లమెంటు పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలు, 60కి పైగా మండలాలు, వెయ్యికి పైగా గ్రామాలు, 12 మున్సిపాలిటీలు ఉన్నాయి. ఉన్న సమయంలోనే ఇవన్నీ పర్యటించాలంటే అభ్యర్థికి కత్తి మీద సాములాంటిదే. అందుకే ఎక్కడ వ్యతిరేకంగా ఉందో, ఏయే చోట అనుకూలంగా ఉందో ముందే పసిగట్టడానికి సర్వే సంస్థలను ఏర్పాటు చేసుకున్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు తమకు అందించే బాధ్యతను సర్వే ఏజన్సీలకు అప్పగించారు.

కులాలు, వర్గాలపై ఫోకస్..

ఎన్నికల్లో అన్ని కులాలు, వర్గాల ప్రభావం ఉంటుంది. ఏయే కులం మద్దతు ఎవరికి ఉందనే విషయం కూడా పోలింగ్‌కు కొద్దిరోజుల ముందు తెలిసిపోతుంది. యువత, మహిళలు, రైతులు, బీడీ కార్మికులు, దివ్యాంగులు, ప్రభుత్వ ఉద్యోగులు, నిరుద్యోగులు.. తదితరవర్గాల అభిప్రాయాలు సైతం కీలకం కానున్నాయి. అందుకే అభ్యర్థులు కులాల వారీగా సర్వేలు చేయిస్తున్నారు. ఏదైనా కులం లేదా వర్గం వ్యతిరేకంగా ఉన్నా.. అందుకు కారణాలను విశ్లేషిస్తున్నారు. వ్యతిరేకంగా ఉన్న కులం మద్దతును కూడగట్టుకోవడానికి ఈ విధానం సులభమవుతుందని భావిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రక్రియ కొనసాగుతున్నట్లుగా తెలుస్తున్నది. అందుకే ఆయా పార్టీల అభ్యర్థులు ప్రత్యేకంగా కులాలతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా యువత, మహిళలు, రైతుల ఓట్లను పొందడానికి అనేక ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. ప్రభుత్వ ఉద్యోగులు, నిరుద్యోగుల ఓటర్ల మనోభావాలను సేకరిస్తున్నారు. మెదక్ పార్లమెంటు పరిధిలో 2లక్షలకు పైగానే బీడీ కార్మికులు ఉంటారు. వీరి అభిప్రాయాలు సైతం గుట్టుగా రాబడుతున్నారు. ప్రైవేట్ పాఠశాలల యజమానులు, టీచర్లు, వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, లాయర్లు, వైద్యులు ఇలా అన్నివర్గాల మనసులో మాటను తెలుసుకునేలా సర్వే సంస్థలు లోతుగా పనిచేస్తున్నాయి.

ప్రచార హడావుడి షురూ

ఎన్నికలకు సమయం సమీపిస్తుండడంతో ప్రచార హడావిడి ఊపందుకుంది. నామినేషన్లకు ముందే క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు తన అభ్యర్థిత్వం ఖరారైన వెంటనే ప్రచార రథాలను తయారుచేయించారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి సైతం పెద్ద ఎత్తున ప్రచార రథాలను వినియోగిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు అభ్యర్థులు, వారి పార్టీలకు సంబంధించిన పాటలు, సందేశాలతో ఈ ప్రచార రథాల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు. అంతేగాకుండా కళాబృందాలతోపాటు ప్రత్యేక ఎల్ఈడీ స్క్రీన్‌లు కలిగిన వాహనాలను గ్రామాలు, పట్టణాల్లో తిప్పుతున్నారు. సర్వే సంస్థలు ఇచ్చిన రిపోర్టుల ఆధారంగా సదరు పార్టీలకు వ్యతిరేకంగా ఉన్న ప్రాంతాల్లో ముమ్మరంగా ప్రచారం చేయడం ద్వారా వారి మనసు మార్చడానికి ప్రయత్నిస్తున్నారు. తమ హయాంలో జరిగిన అభివృద్ధిని ఒకవైపు.. భవిష్యత్తులో చేయబోయే పనుల గురించి మరోవైపు చెబుతూ జోరుగా ప్రచారం చేస్తున్నారు. అసంతృప్తిని వెల్లగక్కిన కులాల పెద్దలు, వర్గాల పెద్దలు, పార్టీల్లోని అసమ్మతి నేతలను బుజ్జగించి మచ్చిక చేసుకోవడానికి సర్వే నివేదికలు ఉపయోగపడుతున్నాయి.

గతాన్ని వదిలేయండి..

సమన్వయంతో పనిచేయాలి

- నీలం మధు, కాట శ్రీనివాస్‌గౌడ్‌తో సీఎం రేవంత్‌రెడ్డి
- మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ నాయకులు, మంత్రులతో సమావేశం



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర్‌తో అభ్యర్థి నీలం మధు, ఎమ్మెల్యే రోహిత్, కాట శ్రీనివాస్‌గౌడ్, ఆవుల రాజిరెడ్డి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఏప్రిల్ 3: మెదక్ లోక్‌సభ స్థానంలో నాయకులు గతాన్ని పక్కనపెట్టి సమన్వయంతో పనిచేసి ఘన విజయం సాధించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. హైదరబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో సీఎం బుధవారం మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి, మంత్రి కొండా సురేఖ, జిల్లాకు చెందిన మంత్రి దామోదర్ రాజనర్సింహ, అభ్యర్థి నీలం మధులతో పాటు అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో సమీక్షించారు. అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిల్లో ప్రచారానికి సంబంధించిన వివరాలను నియోజకవర్గ ఇన్‌చార్జిలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో వేర్వేరు పార్టీల తరఫున పోటీచేసిన కాంగ్రెస్ పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, మెదక్ లోక్‌సభ అభ్యర్థి నీలంమధుతో ప్రత్యేకంగా మాట్లాడారు. కలిసి పనిచేసి ఎన్నికల్లో విజయం సాధించాలని సూచించారు. ఇందిరాగాంధీ ప్రాతినిధ్యం వహించిన మెదక్ లోక్‌సభ స్థానానికి ఎంతో చారిత్రక నేపథ్యం ఉందన్నారు. ఇందిరమ్మ చలువతోనే పారిశ్రామికవాడగా అభివృద్ధి చెంది వేలాది మందికి ఉపాధి కల్పించిందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పని అయిపోయిందని, బీజేపీ పరిస్థితి దారుణంగా ఉందని పేర్కొన్నారు. ఈ పరిస్థితిల్లో మెదక్ ప్రజల ఆశీర్వాదం కాంగ్రెస్ పార్టీకే ఉందని, నీలంమధు గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం నర్సాపూర్ నియోజకవర్గ ముఖ్య నాయకులతో సీఎం సమావేశమయ్యారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు సుహాసినిరెడ్డి, శేషసాయిరెడ్డి తదితరులతో మాట్లాడి నియోజకవర్గంలో పరిస్థితులు, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి చేరిక అంశంపై ఆరా తీశారు. సమావేశంలో సమావేశంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ, టీఎస్ఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జిలు రాజిరెడ్డి, చెరుకు శ్రీనివాస్ రెడ్డి, పూజల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లైన ఆరు రోజులకే వరుడి మృతి

● వ్రతం కోసం ఆటోలో వెళ్తుండగా ప్రమాదం


సత్యనారాయణ

నర్సాపూర్, ఏప్రిల్ 3 : సరిగ్గా ఆరు రోజుల క్రితం అతని వివాహం జరిగింది. నూతన వధువరులు సత్యనారాయణస్వామివ్రతం చేసేందుకు కటుంబీకులతో కలిసి ఆటోలో వెళ్తుండగా, అది ప్రమాదవశాత్తు బోల్తా పడి వరుడు మృతి చెందాడు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం వడ్డెపల్లికి చెందిన మలుగుల పోచయ్య, బూదెమ్మ దంపతుల ఒక్కగానొక్క కుమారుడు సత్యనారాయణ(24), ఇద్దరు కూతుళ్లు ఉండగా, కూతుళ్ల పెళ్లి ఇదివరకే అయింది. సత్యనారాయణకు గత నెల మార్చి 28న పెళ్లి అయింది. ఇంట్లో శుభకార్యం అయినందున కుటుంబం మొత్తం శివ్వంపేట మండలం చాకరిమెట్ల ఆంజనేయస్వామి ఆలయం వద్ద సత్యనారాయణ వ్రతం చేయాలని నిర్ణయించుకున్నారు. మంగళవారం నూతన వధూవరులతో పాటు వరుడి తల్లిదండ్రులు, మరో ఇద్దరు ఆటోలో బయలు దేరారు. ఆటో సంగారెడ్డి-నర్సాపూర్ ప్రధాన రోడ్డుపై నర్సాపూర్ పట్టణ సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న నూతన వరుడు సత్యనారాయణతో పాటు బాలికకు గాయాలయ్యాయి. వెంటనే వారిని నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. హైదరాబాద్ ఆస్పత్రిలో సత్యనారాయణ మృతి చెందాడు. పెళ్లి అయిన ఆరు రోజులకే నూతన వరుడు మృతి చెందడంతో ఆ ఇంట్లో విషాదం నెలకొంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తూప్రాన్ వద్ద రూ.లక్ష సీజ్

తూప్రాన్, ఏప్రిల్ 3: మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ శివారులో బుధవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ. లక్ష సీజ్ చేసినట్లు తూప్రాన్ ఎస్‌ఐ శివానందం తెలిపారు. పట్టణ పరిధిలో 44వ జాతీయ రహదారిపై దాబా హోటళ్ల వద్ద వాహన తనిఖీల్లో భాగంగా ప్రైవేటు బస్సును తనిఖీ చేశారు. బస్సులో మహారాష్ట్ర గాంధీనగర్‌కు చెందిన గీతా కులకర్ణి వద్ద రూ. లక్ష పట్టుబడ్డాయి. సదరు నగదుకు సంబంధించి, ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వాటిని సీజ్ చేశారు. తనిఖీల్లో తూప్రాన్ ఏఎస్‌ఐ లక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే భూమి సారవంతం

● కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ నాల్కర్

కొల్చారం, ఏప్రిల్ 3: ప్రకృతి వ్యవసాయంతోనే భూమి సారవంతం అవుతుందని, అధిక దిగుబడులు సాధించవచ్చని తునికి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్‌డీ నాల్కర్ అన్నారు. కొల్చారం మండల పరిధిలోని సంగాయిపేటలో మంజీరా రైతు ఉత్పత్తిదారుల సహకారం సంఘం వద్ద ప్రకృతి వ్యవసాయంపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాల్కర్ మాట్లాడుతూ రసాయనిక ఎరువులు మోతాదుకు మించి వాడటం వల్ల భూమిలో చౌడుశాతం పెరిగి, నిస్సారమవుతుందన్నారు. వర్షాకాలంలో సేంద్రియ ఎరువులతో పాటు జీలుగ, జనుము లాంటి పచ్చిరొట్ట పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ప్రోగాం ఇన్‌చార్జి డాక్టర్ రవికుమార్, శాస్త్రవేత్త ప్రతాప్ రెడ్డి, మంజీరా రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు జితేందర్‌రెడ్డి(గణేష్ రెడ్డి), ఏఇవోలు నిరోషా, ప్రతిభ, అంబిక, వినీతభవానీ, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి న్యాలకల్ ఎంపీపీ


కాంగ్రెస్‌లో చేరిన ఎంపీపీ అంజమ్మ, తదితరులు

న్యాల్‌కల్, ఏప్రిల్ 3: న్యాల్‌కల్ బీఆర్‌ఎస్ ఎంపీపీ అంజమ్మ బుధవారం హైదరాబాద్‌లో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన ఆమె కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎంపీపీతోపాటు నాయకులు రాజ్‌కుమార్, నగేష్ తదితరులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పనులను చూసి పార్టీలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారన్నారు. కాంగ్రెస్ మాటకు కట్టుబడి పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చంద్రశేఖర్, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, అశోక్, రంజిత్, బలరాంరెడ్డి, వెంకట్ రెడ్డి, సునిల్, వడ్డీ రత్నం తదితరులు పాల్గొన్నారు.



● రుణమాఫీ, ఫసల్‌బీమా, ధాన్యానికి బోనస్
● విత్తన సబ్సిడీకి సమాయత్తమవుతున్న సర్కార్
● రైతుభరోసా పెంచేందుకు ప్రభుత్వం ప్లాన్
● అన్ని అందితేనే అన్నదాతలకు నో ఫికర్

రైతన్నలకు మంచి రోజులు

గజ్వేల్, ఏప్రిల్ 3: రైతన్నలకు మంచి రోజులు రానున్నాయా అంటే అవుననే సమాధానమే వస్తుంది. నాలుగు నెలల క్రితం ఏర్పడిన కాంగ్రెస్ సర్కార్ రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా చర్యలను చేపట్టింది. ఈ మేరకు కసరత్తును ప్రారంభించినట్లు తెలుస్తుంది. వానాకాలం సీజన్ ప్రారంభమయ్యే వరకు పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉండనున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే రైతులకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చేందుకు అయ్యే ఖర్చును అంచనా వేస్తూ యాక్షన్ ప్లాన్‌ను రెడీ చేస్తున్నట్లు తెలిసింది. ముఖ్యంగా రూ.2 లక్షల రుణమాఫీ, ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్, రైతన్నల పంటకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, విత్తనాలకు గతంలో అందించిన మాదిరిగా సబ్సిడీని అందించేందుకు కసరత్తు చేస్తున్నట్లు అధికారిక వర్గాలు చెబుతున్నాయి. ఇవన్నీ అమలు అయితే, జిల్లాలో రైతాంగానికి మేలు జరగనుంది.

ఐదెకరాలలోపు లక్ష మంది..

సిద్దిపేట జిల్లాలో వానాకాలంలో 3,39,289 మంది రైతులు 5లక్షల 40వేల ఎకరాల్లో ఆయా పంటలను సాగు చేస్తుండగా, రూ.322 కోట్ల 42లక్షల 24వేల 343లను రైతుబంధుగా అందిస్తుంది. ఇక యాసంగి సీజన్‌లో 3,45,782 మంది రైతులు మూడున్నర లక్షల ఎకరాల్లో ఆయా పంటలను సాగు చేస్తుండగా, రూ.322కోట్ల 93లక్షల 3వేల 613లను రైతుబంధును అందిస్తుంది. జిల్లాలో 3లక్షల 50వేల మంది రైతులు ఉండగా రెండున్నరెకరాలలోపు రైతులు దాదాపుగా 2లక్షల 25వేల మంది ఉన్నారు. ఐదు ఎకరాల లోపు దాదాపుగా లక్ష మంది ఉండగా, ఐదెకరాల పైబడిన రైతులు దాదాపుగా 25వేల మంది ఉన్నట్లు అధికారుల అంచనా వేశారు. ఐదు ఎకరాల లోపే రైతు బంధు ఇవ్వాలని సీలింగ్ విధించడంతోపాటు కేవలం పంట పొలాలకు రైతుబంధును అందిస్తే ప్రభుత్వ సొమ్ము ఆదా అవుతుంది.

ఏటా పంట నష్టాలే..

సిద్దిపేట జిల్లాలో ఏటా వడగండ్లతో పంట నష్టపోతూనే ఉన్నారు. గత వర్షాకాలంలో భారీ వర్షాలతో వరి పంటకు నష్ట కలిగితే, ప్రస్తుత సీజన్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల వలన పంటలకు నష్ట వాటిల్లింది. ప్రతి యాసంగి సీజన్‌లో వడగండ్లతో చిన్నకోడూరు, నంగునూరు, వర్గల్, బెజ్జంకి, హుస్నాబాద్, కోహెడ మండలాల్లో తీవ్రంగా పంటలకు నష్ట వాటిల్లుతుంటుంది. ఈ నేపథ్యంలో రైతులు పెట్టిన పెట్టుబడులకు తీవ్ర నష్టం వాటిల్లుతూ రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రధాన మంత్రి ఫసల్‌బీమాను అమలు చేస్తే రైతులు ధీమాగా ఉండవచ్చు. 2019లో అక్కన్నపేట మండలంలో ఫసల్ బీమాను అక్కడి వ్యవసాయాధికారి ప్రత్యేకంగా రైతులతో ప్రీమియం కట్టిస్తే వడగండ్లకు నష్టపోయిన రైతులకు రూ.2.8కోట్ల పరిహారాన్ని బీమా కంపెనీలు అందించాయి. ఫసల్ బీమాతో జిల్లా వ్యాప్తంగా 3లక్షల 50వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ప్రీమియం విషయంలోనే ప్రభుత్వం ఆలోచన చేస్తుండగా, ప్రభుత్వం చెల్లించాలా... రైతు చెల్లించాలా అనే అంశంపై కసరత్తు చేస్తుంది.

1.75 లక్షల మంది రైతులకు ప్రయోజనం

కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షలలోపు ఉన్న రుణాలను మాఫీ చేస్తే సిద్దిపేట జిల్లావ్యాప్తంగా లక్షా 75వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రూ.లక్ష వరకు ఉన్న రుణాలను మాఫీ చేసింది. ఈ క్రమంలో జిల్లావ్యాప్తంగా దాదాపుగా రూ.450కోట్లను రైతుల ఖాతాల్లో జమచేసింది. తాజాగా ప్రభుత్వం రుణమాఫీ చేసేందుకు ప్రణాళిక చేస్తుండడంతో జిల్లా వ్యాప్తంగా లక్షా 75వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరే అవకాశాలు ఉన్నాయి.

రూ.500 బోనస్‌తో..

కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు వచ్చే వానాకాలం నుంచి రైతులు పండించిన ధాన్యానికి రూ.500 బోనస్‌ను అందించేందుకు కసరత్తు చేస్తుంది. ఈ నేపథ్యంలో జిల్లాలో 3లక్షల 40వేల ఎకరాల్లో రైతులు వరిపంటను సాగు చేస్తుండగా, జిల్లా వ్యాప్తంగా దాదాపుగా 7లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుంది. ఇందులో లక్షన్నర మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు సొంత అవసరాలకు వినియోగించుకుంటుండగా, దాదాపుగా ఐదున్నర లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వానికి కొనుగోలు కేంద్రాల్లో ప్రతి ఏటా విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో క్వింటాలుకు రూ.500 బోనస్ కల్పిస్తే రైతులకు అదనంగా రాబడి వచ్చే అవకాశం ఉంది.

కాంగ్రెస్‌లో చేరిన ముగ్గురు కౌన్సిలర్లు

● సిద్దిపేట మున్సిపల్‌లో బీఆర్‌ఎస్‌కు గండి
● అవిశ్వాసం ప్రవేశ పెడతాం
● కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 3: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సొంత నియోజకవర్గ కేంద్రమైన సిద్దిపేట మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్‌కు గండిపడింది. ఈ మున్సిపాలిటీకి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు సాక్షి బాలలక్ష్మి ఆనంద్, శ్రీదేవి బుచ్చిరెడ్డి, రియాజ్ బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తు ఇమామ్‌ల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ మాట్లాడుతూ, మున్సిపాలిటీ పరిధిలో పలువురు కౌన్సిలర్లు తమతో టచ్‌లో ఉన్నారని, సిద్దిపేట మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం ప్రవేశపెడతామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మల యాదగిరి, గయాజుద్దీన్, షాబుద్దీన్, ఖలీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


మంత్రి కొండా సురేఖను కలిసిన మున్సిపల్ కౌన్సిలర్లు


మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన మెదక్ కౌన్సిలర్లు, నాయకులు

కాంగ్రెస్‌లోకి మెదక్ బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 3: మెదక్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీలోకి వలసలు ప్రారంభమయ్యాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో స్థానికంగా ఓటమి పాలవడం.. అటు అధికారంలో లేకపోవడంతో పార్టీని వీడేందుకు పలువురు కౌన్సిలర్లు, నాయకులు పావులు కదిపారు. స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావులను పలుమార్లు కలిసి పార్టీలో చేరేందుకు సముఖత వ్యక్తం చేశారు. అదే విధంగా స్థానికంగా ఉన్న కాంగ్రెస్ నేతలు సైతం పార్టీలోకి కౌన్సిలర్లను ఆహ్వానించారు. దీంతో ఎట్టకేలకు పట్టణానికి చెందిన కౌన్సిలర్లు మేడి కళ్యాణి, జయశ్రీ, వసంతరాజ్‌లతో పాటు బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, కో-ఆప్షన్ సభ్యులు మందుగుల గంగాధర్ మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో బుధవారం రాత్రి నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో పార్టీలో చేరారు. అదే విధంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మేడి మధుసూదన్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు దుర్గాప్రసాద్ కొండా శ్రీనివాస్, విక్రం ఉన్నారు. వీరితో పాటు న్యాయవాది జీవన్‌రావు, నాయకులు బొజ్జ పవన్, ఉప్పల రాజేష్, వెంకటరమణ, కానుగు భూపతిరాజు, ప్రవీణ్, హరిత, హఫిజొద్దీన్, గుదూరి కృష్ణ తదితరులు ఉన్నారు.

ఇండస్ట్రియల్ పార్క్‌ను సందర్శించిన ఐలా అధికారి

మనోహరాబాద్, ఏప్రిల్ 3 : తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ కార్పొరేషన్(ఐలా) మేనేజింగ్ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం మనోహరాబాద్ మండలం కొండాపూర్, ముప్పిరెడ్డిపల్లిలోని ఐలా ఇండస్ట్రియల్ పార్క్‌ను సందర్శించారు. సీఈ శ్యామ్‌సుందర్, జోనల్ మేనేజర్ మాధవి బృందం ఆయనతో ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన పరిశ్రమలను పరిశీలించారు. వాటి యజమానులతో మాట్లాడారు. కొందరు పరిశ్రమల యజమానులు విద్యుత్ అంతరాయం ఉందని, సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సదుపాయం కల్పించాలని ఎండీ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో యాజమానుల సంఘం జనరల్ సెక్రటరీ సుబ్రమణ్యం, జాయింట్ సెక్రెటరీ సాంబశివరావు, వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, కోశాధికారి అశోక్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు సత్యనారాయణ, దుర్గప్రసాద్, నవనీతకూమార్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.


కొండాపూర్‌లో శ్రీకృష్ణ ప్లాస్టిక్ పరిశ్రమను పరిశీలిస్తున్న రాష్ట్ర ఐలా మేనేజింగ్ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి

ట్రాన్స్‌ఫార్మర్ ను ఢీకొన్న టిప్పర్

● ఎనిమిది విద్యుత్ స్తంభాలు ధ్వంసం

రామాయంపేట, ఏప్రిల్ 3 : టిప్పర్ డ్రైవర్ అజాగ్రత్త వల్ల రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, ఎనిమిది విద్యుత్ స్తంభాలు ధ్వంసమయ్యాయి. రోడ్డు పనుల్లో భాగంగా మండల పరిధి తొనిగండ్ల శివారులో బుధవారం మట్టి అన్‌లోడ్ చేసి హైడ్రాలిక్‌తో వెళ్లగా ఈ ఘటన జరిగింది. అదృష్టవశాత్తూ లక్మాపూర్ సబ్‌స్టేషన్‌లో కరెంట్ ట్రిప్ కావటంతో డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు.

జాగ్రత్తలతోనే వడదెబ్బ నివారణ

● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 3 : ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. వడదెబ్బ నివారణ, పాటించాల్సిన జాగ్రత్తలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ రూపొందించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆమె కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఎండలు, వడగాలుల తీవ్రమవుతున్న కారణంగా ప్రజలువడదెబ్బకు గురయ్యే ప్రమాదముందని పేర్కొన్నారు. అందుకే అత్యవసరమైతే తప్ప బయటికి రాకూడదని, బయటకు రావాల్సి వస్తే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో గాయత్రీదేవీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో వడదెబ్బ నివారణకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి శశాంకదేశ్‌పాండే, సీనియర్ అసిస్టెంట్ వి.రవి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు ప్రాధాన్యంపై అవగాహన కల్పించాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 3: ఓటు హక్కు ప్రాధాన్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులకు సూచించారు. స్వీప్ జిల్లా కోర్ కమిటీ సమావేశాన్ని బుధవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మెదక్, నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలో స్వీప్ ద్వారా విస్తృతమైన అవగాహన కల్పించాలన్నారు. గతంలో పోలింగ్ తక్కువగా నమోదైన కేంద్రాలను గుర్తించి ఈసారి ఓటింగ్ శాతం పెరగడానికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో స్వీప్ జిల్లా కోర్ కమిటీ సభ్యులు, డీఎస్‌వో రాజిరెడ్డి, డీఆర్‌డీవో శ్రీనివాస్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా స్త్రీశిశు సంక్షేమాధికారి బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.


ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారుల సమక్షంలో మెదక్‌లోని కలెక్టరేట్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మెదక్, సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, నర్సాపూర్, సంగారెడ్డి, పటాన్‌చెరువు నియోజకవర్గాలకు కేటాయించిన బ్యాలెట్ యూనిటుర్ల, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్ల ర్యాండమైజేషన్‌ను ఈఎంఎస్ రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తూ... ఆన్‌లైన్ ద్వారా మొదటి విడత ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు. మెదక్ జిల్లాలోని మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో 584 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 729 బ్యాలెట్ యూనిట్లు, 729(125 శాతం) కంట్రోల్ యూనిట్లు, 816 (140 శాతం) వీవీప్యాట్లను తొలి విడత ర్యాండమైజేషన్‌లో కేటాయించామని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో నాలుగు జిల్లాల రేట్ చార్జీలను రూపొందించి సబంధిత జిల్లాలకు పంపించడం జరిగిందన్నారు. త్వరలో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఏకరూప ధరల పట్టికను ధ్రువీకరించిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు, జిల్లా నోడల్ అధికారులు, ఎన్నికల పర్యవేక్షకులు, వివిధ రాజకీయ పార్టీ నేతలు పాల్గొన్నారు


ఈవీఎంర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

వైభవం..నృసింహుని బ్రహ్మోత్సవం

● నాచగిరి క్షేత్రంలో కొనసాగుతున్న స్వామివారి నవాహ్నిక బ్రహోత్సవాలు
● శేష వాహనంపై ఊరేగిన లక్ష్మీనృసింహుడు


శేషవాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి

వర్గల్, ఏప్రిల్ 3 : రాష్ట్రంలో రెండో యాదాద్రిగా ప్రసిద్ధిగాంచిన వర్గల్ మండల నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో స్వామివారి నవాహ్నిక బ్రహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా బుధవారం లక్ష్మీనృసింహస్వామి వారికి ఆలయ వేద పండితులు శేషవాహనోత్సవ సేవ నిర్వహించారు. పూజా కార్యాక్రమాల అనంతరం సాయంత్రం స్వామివారిని ఆలయ ఉత్తర ద్వారం నుంచి కల్యాణ మండపం వరకు సర్వంగా సుందరంగా అలంకరించిన శేషవాహనంపై అధిష్ఠింపజేసి భాజ భజంత్రీలు, మేళతాళాల మధ్య లక్ష్మీ సమేత నరసింహస్వామివారిని నాచగిరి పూర వీధులలో ఊరేగించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ వేడుకలను తిలకించడానికి భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయం ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పరిసరాలు భక్తి పారవశ్యమైనాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ పర్యవేక్షణలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు ఘనంగా నిర్వహించారు. బ్రహోత్సవాలలో భాగంగా గురువారం స్వామివారికి గరుడోత్సవ సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.


హారతినిస్తున్న అర్చకులు

కోర్టును పరిశీలించిన మెదక్ జిల్లా న్యాయాధికారి



న్యాయవాదులతో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి లక్ష్మీశారద

అల్లాదుర్గం, ఏప్రిల్ 3: త్వరలో ప్రారంభం కానున్న అల్లాదుర్గం సివిల్ కోర్టు నూతన భవనాన్ని మెదక్ జిల్లా న్యాయాధికారి లక్ష్మీశారద బుధవారం సందర్శించి పరిశీలించారు. తాత్కాలికంగా స్థానిక వసతి గృహంలో ఏర్పాటు కానున్న కోర్టు నిర్వహణ కోసం కొన్ని రోజులుగా పనులు కొనసాగుతున్నాయి. భవనాన్ని పరిశీలించిన న్యాయమూర్తి కోర్టు నిర్వహణకు అనుకూలంగా ఉంటుందని సంతృప్తి వ్యక్తం చేశారు. న్యాయవాదుల గది, స్టోర్ రూం తదితర గదుల నిర్వహణకు సంబంధించి న్యాయవాది పీజే విఠల్‌రెడ్డికి పలు సూచనలు జేశారు. ఈ నెల చివరి వారంలో కోర్టు భవనం ప్రారంభం కానునన్నట్లు తెలుస్తుంది. కార్యక్రమంలో న్యాయవాదులు వెంకటకృష్ణ, స్థానిక సీఐ రేణుక తదితరులు ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

నర్సాపూర్, ఏప్రిల్ 3: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో వివిధ ప్రాంతాలలో విధులు నిర్వహించే ఉద్యోగులు, సిబ్బంది ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలో డివిజన్ కార్యాలయంతో పాటు అన్ని తహసీల్ కార్యాలయాల్లో అన్ని వివరాలతో ఫారం-12ను ఏప్రిల్ 5వ తేదీలోపు సమర్పించాలని సూచించారు. ఎన్నికల విధులకు నియమించిన ప్రతి ఒక్కరూ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలన్నారు. అదేవిధంగా ఎన్నికల విధులలో కచ్చితంగా పాల్గొనాలని లేకపోతే ఎన్నికల సంఘం చర్యలు తీసుకునే అవకాశముంటుందన్నారు.

ఊపందుకున్న ఉపాధి హామీ పనులు

- జహీరాబాద్ నియోజకవర్గంలో 16వేల మందికి ఉపాధి
- పని ప్రదేశంలో కూలీలకు కనీస సౌకర్యాలు కరువు




జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి), దిడిగి గ్రామాల్లో పనులు చేస్తున్న ఉపాధిహామీ కూలీలు

జహీరాబాద్, ఏప్రిల్ 3: వేసవికాలం వచ్చిందంటే చాలు నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో ఉపాధి హామీపనులు ఊపందుకుంటాయి. ఈసారి కూలి రేట్ల పెంపు కారణంగా కూలీలు ఉత్సాహంగా పనులకు హాజరవుతున్నారు. వేసవి దృష్ట్యా ఉదయం పనిచేసుకుని మధ్యాహ్నం ఇంట్లో సేదదీరవచ్చనే భావనతో కూలీలు ఉపాధి పనులను చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. వలసల నివారణలో భాగంగా చేపట్టే పనులతో గ్రామీణప్రాంత ప్రజలకు ఈ పథకం వరంగా మారింది. గతంలో కూలి రేట్లు ఒక్కొక్కరికి రూ.200లపైచిలుకు ఉండగా ప్రస్తుతం రూ.300 చొప్పున పెంచడంతో పనులు చేసేందుకు కూలీలు ఆసక్తిని కనబరుస్తున్నారు. జహీరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా బుధవారం నాటికి కోహీర్, జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లో ప్రస్తుతం సుమారు 16వేల మంది కూలీలు ఉపాధిహామీ పనులను చేస్తున్నారు. జహీరాబాద్ మండలంలో 2,306, మొగుడంపల్లిలో 3,189, ఝరాసంగం 3,872, న్యాల్‌కల్‌లో 4,039, కోహీర్‌లో 2,544 మంది కూలీలు ఉపాధిహామీ పనులకు హాజరవుతున్నారు.

కనిపించని సౌకర్యాలు

ఉపాధిహామీ పనులు కొనసాగుతున్న ప్రదేశాల్లో కూలీలకు మంచినీరు, నీడ, ఫస్ట్ ఎయిడ్ కిట్లతో పాటు అవసరమైన సౌకర్యాలు లేక కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నాలుగైదేళ్లుగా పని ప్రదేశంలో కనీస సౌకర్యాలను తీసివేయడంతో ఉపాధికూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనిప్రదేశంలో సరైన సౌకర్యాలు కల్పించాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు.

ఊరంపల్లిలో కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

టేక్మాల్, ఏప్రిల్ 3: ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఊరంపల్లి గ్రామ పరిధిలోని సమీప చెరువు వద్ద ఉపాధిహామీ కార్మికులకు బుధవారం ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం వైద్యాధికారి పృథ్వీ మాట్లాడుతూ... ఎండాకాలంలో కార్మికులు డీ హైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉన్నందున ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశామని వివరించారు. కార్యక్రమంలో గ్రామస్థులు ఫీల్డ్ అసిస్టెంట్లు తెలిపారు.



ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్న దృశ్యం

ఝరాసంగంలో ఉపాధి పనులను పరిశీలించిన డీఆర్డీవో

ఝరాసంగం, ఏప్రిల్ 3: మండల కేంద్రంతో పాటు మండలపరిధిలోని కుప్పానగర్, తదితర గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను బుధవారం సంగారెడ్డి జిల్లా డీఆర్డీవో జ్యోతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మరింత మందికి ఉపాధిపనులను కల్పించేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో సుధాకర్, ఏపీవో రాజ్‌కుమార్‌లకు సూచించారు. ఈ అవకాశాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



కుప్పానగర్‌లో ఉపాధి పనులను పరిశీలిస్తున్న డీఆర్డీవో జ్యోతి

రెండు బైక్‌లు ఢీకొని ఒకరి మృతి



రమేష్(ఫైల్)

మెదక్ అర్బన్, ఏప్రిల్ 3: పట్టణంలో మంగళవారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక రాంనగర్ కాలనీకి చెందిన పోల్లంపల్లి రమేష్(50) ఓ ట్రాక్టర్ షోరూంలో సేల్స్‌మన్‌గా పని చేస్తున్నాడు. రాత్రి స్నేహితుడు కృష్ణతో కలిసి బైక్‌పై ఇందిరాపురి కాలనీకి వెళ్తున్న క్రమంలో ఎదురుగా అతివేగంగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెనుక కూర్చున్న రమేష్ కింద పడగా.. తలకు బలమైన గాయమైంది. వెంటనే ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య నీలిమ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

అప్పులు తీర్చలేక వ్యక్తి బలవన్మరణం



రాజాగౌడ్ (ఫైల్)

తూప్రాన్, ఏప్రిల్ 3: మండలంలోని మల్కాపూర్‌లో ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు తీర్చలేక విషం తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాపూర్ గ్రామానికి చెందిన బట్టి కాడి రాజాగౌడ్(40) గజ్వేల్‌లో వాటర్ ప్లాంట్‌లో పని చేస్తూ జీవిస్తున్నాడు. ఇటీవల ఇంటి నిర్మాణం కోసం రూ.3లక్షలు అప్పులు చేశాడు. అప్పులతో పాటు సంసారభారం మోయలేక జీవితంపై విరక్తి చెందాడు. మంగళవారం మధ్యాహ్నం మల్కాపూర్ గ్రామ శివారులో గడ్డి మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబీకులు వెంటనే సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాజాగౌడ్ బుధవారం మృతిచెందాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ శివానందం వివరించారు.

భార్య మందలించిందని వ్యక్తి..



మృతి చెందిన వెంకటరమణ

వెల్దుర్తి, ఏప్రిల్ 3: మద్యం తాగి దుబారా చేయొద్దని భార్య మందలించడంతో పురుగుల మందు తాగిన వ్యక్తి బలవన్మరణం చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. బుధవారం ఎస్ఐ నవత, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా వడ్లమూర్ గ్రామానికి చెందిన దంపతులు కాళీదాసు భాగ్యలక్ష్మి, వెంకటరమణ(40) వెల్దుర్తి మండలంలోని శెట్టిపల్లి గ్రామంలో ఓ వ్యవసాయ పొలంవద్ద పని చేసుకుంటూ జీవిస్తున్నారు. మంగళవారం రాత్రి మద్యం విషయంలో భార్యభర్తలకు చిన్న గొడవ జరిగింది. వచ్చిన డబ్బు తాగాడానికి ఖర్చు చేస్తే కుటుంబం గడిచేదెలా అని భార్య మందలించింది. దీంతో బయటకు వెళ్లిన వెంకటరమణ కొద్దిసేపటి వరకు తిరిగి రాలేదు. దీంతో అతడి కోసం గాలించగా వారు పనిచేస్తున్న వ్యవసాయ పొలం వద్దనే గుర్తు తెలియని పురుగుల మందు తాగినట్టు గుర్తించిన భార్య చుట్టుపక్కల వారి సాయంతో మెదక్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

సాదాసీదాగా రోడ్డుపైనే లస్సీ తాగిన ఎమ్మెల్యే చింతా



సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 3: ఎక్కడికి వెళ్లినా హంగు.. ఆర్భాటంతో వెళ్లే సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ బుధవారం సాదాసీదాగా రోడ్‌పై కూల్‌డ్రింక్ షాపులో లస్సీ తాగడం అందరినీ ఆకర్షించింది. సంగారెడ్డిలోని జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న ఓ కూల్‌డ్రింక్ షాపులో లస్సీ తాగేందుకు వచ్చిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను చూసి షాపు యజమాని తొలుత ఆశ్చర్యపోయినా, తేరుకుని లస్సీని అందించి ఆనందం వ్యక్తం చేశాడు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ వెంట బీఆర్ఎస్ నాయకులు జైపాల్‌రెడ్డి, కాసాల బుచ్చిరెడ్డి, వెంకటేశ్వర్లు, నర్సింహులు తదితరులు ఉన్నారు.

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా

- టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ జానకిరాములు



మెదక్ అర్బన్, ఏప్రిల్ 3: మెదక్ జిల్లాలో విద్యుత్ వినియోగం గతంలో కంటే పెరిగిందని టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ జానకిరాములు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. మెదక్ పట్టణంలో విద్యుత్ సరఫరాలో సమస్యలు ఉన్నా... అంతరాయం కలిగిన సమస్యల పరిష్కారం కోసం ఫీజ్ ఆఫ్ కాల్ ఏర్పాటు చేశామన్నారు. వినియోగదారులు 08452-222382, 7382616080 ఫోన్ నంబర్ల ద్వారా సంప్రదించాలని సూచించారు. 24 గంటల పాటు సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 593 మెగావాట్ల డిమాండ్ ఉండగా.. విద్యుత్ వినియోగం 9.7 మిలియన్ యూనిట్లు సరఫరా ఉందన్నారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థులకు అవార్డులు

పుల్‌కల్, ఏప్రిల్ 3: మండలంలోని బస్వాపూర్ తెలంగాణ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు ప్రపంచ స్థాయి అవార్డులకు ఎంపికయ్యారు. ముంబైకి చెందిన రంగోత్సవ్ సెలబ్రేషన్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ వ్యాప్తంగా గత ఫిబ్రవరిలో పాఠశాల స్థాయిలో ఈ పోటీలను నిర్వహించారు. వివిధ విభాగాలకు సంబంధించిన సామగ్రిని సెలబ్రేషన్ సంస్థ పోస్టులో పాఠశాలకు పంపించగా, పోటీలు పూర్తయిన అనంతరం తిరిగి ఆ సామగ్రిని ముంబైకి పంపించారు. అక్కడ ఎంపిక కమిటీ ఆయా విభాగాల పోటీలను పరిశీలించి విద్యార్థులను ఎంపిక చేసినట్లు తమకు సమాచారం అందజేశారని ప్రిన్సిపాల్ జ్యోతిహెబ్సీబా బుధవారం తెలిపారు. ఈ పోటీలలో 13 మంది విద్యార్థులు పాల్గొని బహుమతులను పొందినట్లు చెప్పారు.

బొంతపల్లిలో వైభవంగా బృంగేశ్వర వాహనసేవ



బృంగేశ్వర వాహనంపై ఊరేగుతున్న భద్రకాళి సమేత వీరభద్రస్వామివారు

గుమ్మడిదల, ఏప్రిల్ 3: మండలంలోని బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలి వస్తున్నారు. బుధవారం రాత్రి వీరభద్రస్వామి భద్రకాళి అమ్మవారిని వేద పండితుల మంత్రోచ్చారణాల మధ్య బృంగేశ్వరవాహన సేవలో భక్తులు ఊరేగించారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి అగ్నిగుండాలను ప్రారంభించారు.

భక్తులు అగ్నిగుండాలలో నడిచి మొక్కులు తీర్చుకున్నారు. గురువారం వీరభద్రస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. కల్యాణ మహోత్సవానికి పెద్ద ఎత్తున తరలివచ్చే భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఈవో శశిధర్ గుప్తా తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వతందారులు అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

నిన్న బీజేపీలోకి.. నేడు తిరిగి బీఆర్ఎస్‌లోకి..



బీబీపేట్‌లో బీజేపీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు



ఖానాపూర్(కె)లో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో తిరిగి బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

కల్హేర్, ఏప్రిల్ 3: ఎన్నికల తేదీలు దగ్గర పడుతున్నకొద్దీ ఆయా పార్టీల రాజకీయాలు రసకందాయంలో పడుతున్నాయి. ఒక్క రోజు తేడాలో రెండు పార్టీలు మారిన బీఆర్ఎస్ నాయకుల తీరే ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. బీఆర్ఎస్‌కు చెందిన నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి, బీజేపీకి చెందిన మరో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి విజయపాల్‌రెడ్డిల దగ్గరి బంధువులైన బీబీపేట్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మహారెడ్డి కిషన్‌రెడ్డి, మల్లారెడ్డి, బాల్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎన్నం నారాయణరెడ్డి, శివారెడ్డి తదితరులు మంగళవారం బీబీపేట్‌లో జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ సోదరుడు ఎంబీ పాటిల్ సమక్షంలో బీజేపీలో చేరి పార్టీ కండువాలు కప్పుకున్నారు. వారిని బీఆర్ఎస్ నాయకులు సముదాయించిన అనంతరం మనసు మార్చుకున్న వారు తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి బుధవారం వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కల్హేర్ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రాంసింగ్, మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు ఎం. రవీందర్‌రెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ గారూ.. న్యాయం చేయండి

- సంగారెడ్డి కలెక్టర్‌కు అమీన్‌పూర్ పెద్దచెరువు ముంపు బాధితుల వినతి

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 3: ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్ల అన్యాయానికి గురైన తమకు న్యాయం చేయాలని అమీన్‌పూర్ పెద్ద చెరువు ముంపు బాధితులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు వారు బుధవారం కలెక్టర్ వల్లూరు క్రాంతిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అమీన్‌పూర్ ముంపు బాధితుల జేఏసీ చైర్మన్ సీహెచ్. సత్యనారాయణ మాట్లాడుతూ.. అమీన్‌పూర్ పెద్ద చెరువులోని 195, 196, 197 సర్వే నంబర్లలో ఏర్పాటు చేసిన లే అవుట్లలో దశాబ్దం క్రితం తాము ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్లను సైతం నిర్మించుకున్నామన్నారు. అయితే కొంతమంది రియల్‌ఎస్టేట్ వ్యాపారులతో కలిసి ఇరిగేషన్ అధికారులు కుట్ర పూరితంగా వ్యవహరించడంతో తమకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ప్రయోజనం కలిగేలా వంద ఎకరాల విస్తీర్ణం కలిగిన పెద్ద చెరువును కొత్త చెరువును విలీనం చేసి 400 ఎకరాల విస్తీర్ణం వున్నట్టు తప్పుడు నివేదికలు తయారు చేశారని ఆరోపించారు. ఈ చెరువులో తమకు నష్టం కలిగేలా ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించారని తెలిపారు. ఫలితంగా తమ కాలనీలన్నీ పెద్ద చెరువులో ముంపునకు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో దర్శన్‌నగర్, పద్మావతినగర్, పాంచజన్య, విధిరి లేఅవుట్, శ్రీవాణి నగర్, అయ్యప్ప ఎన్‌క్లేవ్, వినాయకనగర్, సుబ్రహ్మణ్యస్వామినగర్, విష్ణు ఎన్‌క్లేవ్, సూర్యచంద్రనగర్ తదితర కాలనీల ప్రజలు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న బాధితులు

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన అధికారులు



గుమ్మడిదల: కానుకుంటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో ఉమాదేవి

గుమ్మడిదల, ఏప్రిల్ 3 : మండలంలోని కానుకుంట, గుమ్మడిదల, నల్లవల్లి, గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం మండల అభివృద్ధి అధికారి ఉమాదేవి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని నేరుగా తెలంగాణ ప్రభుత్వం పౌర సరఫరాల సంస్థ జిల్లా గ్రామీణాభివృద్ధి ఆధ్వర్యంలో ఐకేపీ ద్వారా కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. ఎవరైనా రైతులు కొనుగోలు కేంద్రాలకు నేరుగా ధాన్యాన్ని తీసుకువచ్చి అమ్ముకోవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పద్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

- **కల్హేర్:** మండల పరిధిలోని బీబీపేట్ పీఏసీఎస్‌లో యాసంగి సీజన్‌కుగానూ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఏఈవో సతీష్, పీఏసీఎస్ సీఈవో రాంచందర్ ప్రారంభించారు. బీబీపేట పీఏసీఎస్ పరిధిలోని పోచాపూర్, జంలా తండా, ఫత్తేపూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు ఏఈవో సతీష్ తెలిపారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని నిబంధనలకనుగుణంగా కేంద్రాల్లో విక్రయించవచ్చునని ఆయన తెలిపారు. ఏ గ్రేడు ధాన్యానికి రూ.2,203, కామన్ గ్రేడుకు రూ.2,183 మద్దతు ధర చెల్లిస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పండరి, కిషన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి

కోహీర్ ఏప్రిల్ 1: మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం అమ్మ ఆదర్శకమిటీ సభ్యులు కృషి చేయాలని డీఆర్డీఏ ఏపీడీ జంగారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కోహీర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశానుసారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులను నియమించినట్టు తెలిపారు. కమిటీ సభ్యులు ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు పారిశుధ్యం, మరుగుదొడ్ల ఏర్పాటు, తరగతిగదులకు మరమ్మతులు వంటి పనులను చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఇదివరకే ప్రభుత్వానికి ఆయా పాఠశాలల సంబంధించి అవసరమైన మౌలిక సదుపాయాల గురించి నివేదికలు పంపించామన్నారు. నిధులు విడుదల కాగానే అమ్మ ఆదర్శ కమిటీ సభ్యుల ద్వారా సదరు పనులను చేయించడం జరుగుతుందన్నారు. కమిటీ సభ్యులు రూ.25వేల వరకు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో కలిసి అభివృద్ధి పనులు చేపట్టవచ్చన్నారు అంతకు ఎక్కువ నిధులు ఖర్చు అయ్యే అవకాశం ఉంటే ఎంపీడీవో అనుమతితో రూ.లక్ష వరకు అభివృద్ధి పనులు, మౌలిక వసతులు చేపట్టవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో భారతి, మండల విద్యాధికారి శంకర్, ఏపీఎం సమయ్య ఆయా గ్రామాల వీవో అధ్యక్షుడు, ఆయా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

తుంకి నల్లపోచమ్మ ఆలయ హుండీ లెక్కింపు

కౌడిపల్లి, ఏప్రిల్ 3: మండలంలోని తునికి సమీపంలోని ప్రముఖ క్షేత్రమైన నల్లపోచమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.5.48లక్షలు సమకూరినట్టు ఆలయ ఈవో మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం తునికి నల్లపోచమ్మ హుండీ కానుకలను భక్తుల సహకారంతో లెక్కించారు. మూడు నెలలకు సంబంధించిన హుండీలో కానుకలను లెక్కించగా ఈ ఆదాయం వచ్చినట్లు చెప్పారు. లెక్కింపు కార్యక్రమంలో జహీరాబాద్ ఆలయ ఈవో శివరుద్రప్ప, తునికి జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, సిబ్బంది రాజు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సురేష్ షెట్కార్ గృహంలో ముగిసిన నవచండీయాగం



యాగం ముగింపు కార్యక్రమంలో మాజీ ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి తదితరులు

నారాయణఖేడ్, ఏప్రిల్ 3: ఖేడ్‌లోని మాజీ ఎంపీ, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ స్వగృహంలో ఈ నెల 1న ప్రారంభమైన శ్రీరాజశ్యామల సహిత నవచండీయాగం బుధవారం ముగిసింది. మూడు రోజుల పాటు చండీ ఉపాసకులు అయ్యప్పస్వామి, అజయ్‌స్వామి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు గణపతిపూజ, పుణ్యాహవాచనం, ఆవాహిత మండపపూజ, గణపతి హవనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డితోపాటు నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, సురేష్ షెట్కార్ కుటుంబీకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్



మత పెద్దకు ఖర్జూరం తినిపిస్తున్న మాజీ సర్పంచ్ ప్రవీణ్‌కుమార్

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 3 : మతసామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని తాళ్లపల్లి గ్రామ మాజీసర్పంచ్ ఎంకని ప్రవీణ్‌కుమార్ అన్నారు.రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలకు మంగళవారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముస్లిం సోదరులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన ముస్లిం మతపెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల అనంతరం రోడ్డుకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొండాపూర్, ఏప్రిల్ 3: 2 కిలోమీటర్ల దూరానికి.. తొమ్మిది కిలోమీటర్ల ప్రయాణం' అనే శీర్షికన మార్చి 29న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి గ్రామప్రత్యేకాధికారి, ఎంపీడీవో జ్యోతిలక్ష్మి స్పందించి రోడ్డును పరిశీలించారు. బుధవారం మునిదేవునిపల్లి మధిర గ్రామం గడిమల్కాపూర్‌ను రోడ్డును, వాగు, కల్వర్టులను పరిశీలించారు. రోడ్డు మరమ్మతులకు రూ.2కోట్ల అంచనా వేసి గతంలోనే ప్రతిపాదనలు పంపినట్లు పీఆర్ ఏఈ తెలిపారని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం రోడ్డు మరమ్మతులను కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని ఆమె వెల్లడించారు. అమె వెంట పంచాయతీ కార్యదర్శి కిషోర్, సిబ్బంది ఉన్నారు.

బీజేపీలో చేరిన సంగమేశ్వర్‌రెడ్డి



బీజేపీ జాతీయ నాయకుడు తరుణ్‌చుగ్‌తో కరచాలనం చేస్తున్న సంగమేశ్వర్‌రెడ్డి

నారాయణఖేడ్, ఏప్రిల్ 3: నిజాంపేటకు చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సంగమేశ్వర్‌రెడ్డి బుధవారం ఢిల్లీలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ సమక్షంలో బీజేపీలో చేరారు. తరుణ్‌చుగ్ ఆయనకు కండువా కప్పి పార్టీ సభ్యత్వాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంగమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ పురోభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమం బీజేపీతోనే సాధ్యమైనందున తాను పార్టీలో చేరానని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బీబీపాటిల్, కన్వీనర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా మెదక్ జిల్లా అధ్యక్షుడిగా కాశీనాథ్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 3: బీజేపీ ఓబీసీ మోర్చా మెదక్ జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన గడ్డం కాశీనాథ్‌ను నియమించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ తెలిపారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఓబీసీ మోర్చా నూతన అధ్యక్షుడి ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కాశీనాథ్ మాట్లాడుతూ.. తనను అధ్యక్షుడిగా నియమించినందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కారు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు



గాయపడిన పిట్ల మల్లేశం, హరిసింగ్

పుల్‌కల్, ఏప్రిల్ 3: చౌటకూర్ మండలం శివంపేట గ్రామం వద్ద సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పుల్కల్‌కు చెందిన పిట్ల మల్లేశం (48), గొంగ్లూరు గిరిజన తండాకు చెందిన హరిసింగ్ (50) బైక్‌పై రోడ్డు దాటుతుండగా జోగిపేట వైపు నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో పిట్ల మల్లేశం, హరిసింగ్ ఎగిరి కింద పడ్డారు. దీంతో ఇరువురి తల, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని అంబులెన్సులో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పుల్కల్ ఎస్ఐ క్రాంతికాంత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ సిలిండర్లు చోరీ

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 3: మండల కేంద్రంలో ఆగి ఉన్న ట్రాలీ ఆటో నుంచి మూడు గ్యాస్ సిలిండర్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించినట్లు భారత్ గ్యాస్ డెలివరీ బాయ్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నశంకరంపేటకు చెందిన మహ్మద్ ఖలీల్ భారత్ గ్యాస్ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డు పక్కన నిలిపి ఉన్న ఆటో నుంచి మూడు గ్యాస్ సిలిండర్లు దొంగలించినట్లు అతడు గుర్తించాడు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఫెన్సింగ్ కడీలను తొలగించిన ఐదుగురిపై కేసు

జహీరాబాద్, ఏప్రిల్ 3: మండలంలోని గోవిందాపూర్ గ్రామ శివారులోని 112 సర్వేనెంబర్‌లోని 219 ఎకరాల్లో పీపుల్‌ప్రోగ్రెసీవ్ ట్రస్టువారు వేసుకున్న ఫెన్సింగ్‌కడీలను తొలగించిన కమల్‌కిషోర్, రవిపల్లోడ్, ప్రేమ్‌సింగ్, పూల్‌సింగ్, రతన్‌సారడలపై బుధవారం కేసు నమోదైంది. చిరాగ్‌పల్లి ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గోవిందాపూర్ గ్రామశివారులోని 112 సర్వేనెంబర్‌లోని 219 ఎకరాల్లో పీపుల్‌ప్రోగ్రెసీవ్ ట్రస్టువారు2019లో ట్రస్టు పేరిటకొనుగోలు చేశారు. అందులో తమకు 16ఎకరాలు వస్తుందని మార్చి31న నిందితులు పొలంలోకి ప్రవేశించి ఫెన్సింగ్ కడీలను తొలగించారు.తొలగించిన కడీల విలువ సుమారు రూ.5లక్షల వరకు ఉంటుందన్నారు. ట్రస్టు సభ్యుడు గంగారాం శివారెడ్డి వారిని అడ్డగించగా చంపేస్తానని బెదిరించినట్లు తెలిపారు. బాధితుడు గంగారాం శివారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

యువతకు ఓటరు నమోదుపై అవగాహన

గుమ్మడిదల/నాగల్‌గిద్ద, ఏప్రిల్ 3: గుమ్మడిదల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన యువతకు మండల అభివృద్ధి అధికారి ఉమాదేవి బుధవారం ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. అదేవిధంగా నాగల్‌గిద్ద మండల కేంద్రంతో పాటు ముక్తాపూర్ గ్రామాల్లో ఓటర్ నమోదుపై తహసీల్దార్ షబానబీ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది రాజశేఖర్‌రెడ్డి, కృష్ణ, నాయకులురహీం, పండరి, తదితరులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి ప్రదాత దొడ్డి కొమురయ్య

నారాయణఖేడ్, ఏప్రిల్ 3: యువతకు స్ఫూర్తి ప్రదాత దొడ్డి కొమురయ్య అని, ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. బుధవారం ఖేడ్ పట్టణ శివార్లలోని డబుల్‌బెడ్‌రూం గృహాల సమీపంలోని దొడ్డి కొమురయ్య చౌక్ వద్ద కురుమ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య 97వ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యేసంజీవరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, గొర్రెలు, మేకల పెంపకం దారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులుబాపుమల్‌శెట్టి, కురుమసంఘంనాయకులు గోవింద్‌యాదవ్ తదితరులు దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే తాలుకా కురుమ సంఘం ఉపాధ్యక్షుడు మల్గొండ ఆధ్వర్యంలోనూ దొడ్డి కొమురయ్య జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా మండలాల బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

- **తూప్రాన్:** తూప్రాన్ పట్టణ మున్సిపల్ పరిధిలో కురుమ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య 97వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కురుమ సంఘం మండల అధ్యక్షుడు బందెల నరేష్ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఓయూ నాయకులు మధునూరి శ్రీశైలం, యాదవ సంఘం అధ్యక్షుడు తుమ్మెట శ్రీనివాస్‌యాదవ్, ఆబోతు వెంకటేశ్‌యాదవ్, బుల్లె సాయికుమార్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

చిలప్‌చెడ్, ఏప్రిల్ 3: వేసవి దృష్ట్యా గ్రామాల్లో నీటా ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఎల్పీవో యాదయ్య సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎండా కాలంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈజీఎస్ పని ప్రదేశాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో అవగాహన ఫ్లెక్సీలు అమర్చాలని సూచించారు. సమీక్షలో ఎంపీడీవో ఆనంద్, ఎంపీవో శరత్‌కుమార్‌రెడ్డి కార్యదర్శులు ఉన్నారు.